క్లుప్తంగా

ముగిసిన నాటక పోటీలు



ఎమ్మెల్యే దొరబాబుకు షీల్డును అందజేస్తున్న దృశ్యం

కొత్తపల్లి: కొండెవరంలో వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి నాటక పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా నాటక కళా పరిషత్ అధ్యక్షుడు మేడిశెట్టి శ్రీరాములు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దొరబాబుకు పిఠాపురంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో షీల్డ్‌ను అందజేశారు. కార్యక్రమంలో పలువురు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఆపద మిత్రలకు శిక్షణ

సామర్లకోట: స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో ఈ నెల 14 నుంచి 25 వరకూ ఆపద మిత్రలకు శిక్షణ ఉంటుందని ఈటీసీ మేనేజర్ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం సాయంత్రం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ తూర్పుగోదావరి, అనకాపల్లి జిల్లాలకు చెందిన 100 మంది ఆపద మిత్రలకు శిక్షణ ఇస్తామని చెప్పారు. వలంటీర్లు, ఆశవర్కర్లలో ఉత్సాహవంతులైన వారిని ఎంపిక చేసి ఆపద మిత్రలుగా గుర్తించారన్నారు. విపత్తుల సమయంలో బాధితులను రక్షించడానికి ఆపద మిత్రలకు తరగతి గదిలో శిక్షణతో పాటు ఫీల్డ్ విజిట్ ఉంటుందన్నారు.

17 నుంచి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

పెద్దాపురం: చంద్రమాంపల్లి హైస్కూల్ క్రీడా మైదానంలో ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకూ జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు జిలాని శిష్య బృందం ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొంది. వ్యాయామ ఉపాధ్యాయులు ఎంఎం జిలాని మెమోరియల్ జిల్లా స్థాయి కబడ్డీ టోర్నమెంట్ సాయంత్రం వేళల్లో నిర్వహిస్తామన్నారు. రూ. 500 ప్రవేశ రుసుం చెల్లించి జట్లు పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.5 వేలను మొదటి నుంచి నాలుగు స్థానాలకు అందిస్తామన్నారు.

నాగులాపల్లిలో మెగా వైద్య శిబిరం

కొత్తపల్లి: నాగులాపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో ఆదివారం ఉచిత సూపర్ స్పెషాలిటీ మెగా వైద్య శిబిరాన్ని కాకినాడ జిల్లారెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ శిబిరానికి అన్ని వ్యాధులకు సబంధించి వైద్య నిపుణులు పాల్గొన్ని రోగులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి, మందులను అందజేశారు. ఈ వైద్య శిబిరంలో 1200 మంది రోగులకు పరీక్షలు చేశారు.

పంచారామ క్షేత్ర ప్రధానార్చకుడి మృతి



భీమేశ్వరశర్మ (పాత చిత్రం)

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలా త్రిపుర సుందరీ సమేత కుమారరామ భీమేశ్వర స్వామి ఆలయ ప్రధానార్చకుడు చెరుకూరి భీమేశ్వరశర్మ ఆదివారం మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో ఉండగా కాకినాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఆయన మృతికి ఆలయ ఈఓ డి.నాగమల్లేశ్వరరావు, ట్రస్టు బోర్డు చైర్మన్ మట్టపల్లి రమేష్‌బాబు, ట్రస్టు బోర్డు సభ్యులు, అర్చకులు సంతాపం తెలిపారు.

రెగ్యులరైజ్ చేయాలని వినతి

కాకినాడ క్రైం: కొన్నేళ్లుగా కాంట్రాక్టు విధానంలో విధులు నిర్వర్తిస్తున్న తమను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్టు స్టాఫ్ నర్సెస్ వెల్ఫేర్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ చిన్నారి ఆధ్వర్యంలో పలువురు స్టాఫ్ నర్సులు ఆదివారం ఎంపీ వంగా గీతను కలిశారు. ఈ మేరకు నగరంలోని ఆమె కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. నర్సుల వినతిపై సానుకూలంగా స్పందించిన ఎంపీ ఇప్పటికే ఈ విషయం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టిలో ఉందని, తానూ మరోమారు సీఎం దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారు. వైద్య, ఆరోగ్య రంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. పేద, కోవిడ్ వేళల్లో రోగులకు నర్సులు అందిస్తున్న సేవలు మరువలేవని ఎంపీ అన్నారు. అసోసియేషన్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ ఆర్.జీవ కుమార్, జోనల్ కోఆర్డినేటర్ కె.స్వామిదాస్ ఫిలిప్, స్టాఫ్ నర్సులు నీలిమ, నాగజ్యోతి, వరలక్ష్మి, ఆరీఫా, శ్రీనివాస్ పాల్గొన్నారు.

900 మందికి ఆరోగ్య సేవలు

కాకినాడ రూరల్: వలసపాకల గ్రామ పరిధిలోని కోరమాండల్ ఆసుపత్రి ప్రాంగణంలో ఆదివారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. కోరమాండల్ ఇంటర్నేషన్ సంస్థ సామాజిక సేవల్లో భాగంగా మెడికవర్ ఆసుపత్రి సహకారంతో నిర్వహించిన వైద్య శిబిరాన్ని కస్టమ్స్ డిప్యూటీ కమిషనర్ కె.విజయకుమార్ ప్రారంభించారు. కోరమాండల్ కర్మాగారం సమీపంలోని గ్రామాల నుంచి తరలివచ్చిన సుమారు 900 మందికి వివిధ ఆరోగ్య సేవలు అందించారు. యూనిట్ హెడ్ శ్రీనివాసరావు, జీఎం హెచ్ఆర్ పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

ప్రజల చేతిలో పాశుపతాస్త్రం వైఎస్సార్ సీపీ

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- ఘనంగా వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం
- సంబరాలు జరుపుకొన్న పార్టీ శ్రేణులు



పిఠాపురంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా మారి ప్రజల తరఫున పోరాడుతున్నారని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. పిఠాపురం పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని జగ్గంపేటలో 2010 మార్చి 12వ తేదీన పార్టీ అధినేత జగన్ పార్టీని ప్రారంభించారని ఆయన అన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి ప్రజల పక్షాన పోరాడుతూ ప్రజల చేతిలో పాశుపతాస్త్రంగా మారి ప్రజాసమస్యల పరిష్కారానికి పాటుపడుతున్న ఏకైక పార్టీ వైఎస్సార్ సీపీ అన్నారు. ఈ సందర్భంగా నాయకులు పార్టీ జెండాను ఆవిష్కరించి, కేక్ కట్ చేసి అభిమానులకు స్వీట్లు పంపిణీ చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం సెంటర్లో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు కొప్పన శివనాథ్, మహిళా విభాగం అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత, పిఠాపురం పట్టణ, మండల, కొత్తపల్లి మండల, గొల్లప్రోలు నగర పంచాయతీ, మండల పార్టీ అధ్యక్షులు బొజ్జా రామయ్య, జవ్వాది నాయుడు, ఆనాల సుదర్శన్, పర్ల రాజా, అరిగెల రామయ్యదొర మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పచ్చిమళ్ల జ్యోతి, పలువురు నేతలు, కన్వీనర్లు, గృహ సారథులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. గొల్లప్రోలు మండలంలో ఎంపీపీ అరిగెల అచ్చియ్యమ్మ, జెడ్పీటీసీ వులవకాయల నాగ లోవరాజు, అరిగెల రామయ్యదొర, కడింశెట్టి బాస్కరరెడ్డి, గంద్రేటి రాము తదితరుల ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పిఠాపురం మండలంలో పలువురు వైఎస్సార్ సీపీ నేతల ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు.



చేబ్రోలులో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు నాగ లోవరాజు తదితరులు

ఉప్పాడ సెంటర్‌లో..

కొత్తపల్లి: మండలంలో వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం వైఎస్సార్ సీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. వాకతిప్పలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు పార్టీ కార్యాలయం వద్ద జెండాను ఎగురవేశారు. మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఉప్పాడ సెంటర్లో ఉన్న దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి గ్రామ సచివాలయాలు, గృహసారథులు మండల కన్వీనర్ ఉమ్మిడి జాన్, కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, స్థానిక ఎంపీటీసీల ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.



ఉప్పాడ బీచ్ రోడ్డు సెంటర్లో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

చరిత్రలో నిలిచిపోయే ఘట్టమది



సామర్లకోటలో వైఎస్సార్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న దొరబాబు తదితరులు

- వైఎస్సార్ సీపీ ఆవిర్భావంతో సంచలనం
- రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు



కాండ్రకోటలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న నాయకులు

సామర్లకోట: ఊరూ వాడా ఉత్సాహంగా కదిలివచ్చింది.. దేశ రాజకీయాల్లో ప్రభంజనం సృష్టించిన వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించింది. పెద్దాపురం, పిఠాపురం నియోజకవర్గాల్లో ఈ వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. ప్రజల గుండెల్లోంచి వైఎస్సార్ సీపీ పుట్టిందని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సామర్లకోటలోని వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పార్టీ జెండాను ఆవిష్కరించి, కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీని ఏర్పాటు చేసి 12 ఏళ్లు అయ్యిందని, ప్రజల సమస్యలు తెలుసుకోవడానికి ప్రతిపక్ష నేతగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్ప యాత్ర చేశారన్నారు. నైతిక విలువతో కూడిన పార్టీగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ సీపీని విజయవంతంగా నడిపిస్తున్నారని తెలిపారు. దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా బీసీలు, ఎస్సీలకు ఎమ్మెల్సీలతో పాటు అనేక పదవులు ఇచ్చారని చెప్పారు. అటువంటి నాయకుని వెంట నడవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. స్థానికుడే ఎమ్మెల్యేగా ఉండాలని ప్రజలు కోరుకోవడంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పెద్దాపురం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేయడానికి తనకు అవకాశం ఇచ్చారని తెలిపారు. అనంతరం స్థానిక ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేశారు. బడేలమ్మ చెరువు వద్ద సిరి మానసిక దివ్యాంగుల కేంద్రంలో విద్యార్థులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో బాలింతలు, గర్భిణులు, రోగులకు పండ్లు, రొట్టెలు అందజేశారు. అయ్యరక కార్పొరేషన్ రాష్ట్ర చైర్‌పర్సన్ ఆవాల రాజేశ్వరి, మున్సిపల్ చైర్‌పర్సన్‌లు గంగిరెడ్డి అరుణ, బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్లు నెక్కంటి సాయిప్రసాద్, కనకాల మహాలక్ష్మి, ఎంపీపీలు బొబ్బరాడ సత్తిబాబు, పెంకే సత్యవతి, పెద్దాపురం జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు ఆవాల లక్ష్మీనారాయణ, కంటే వీర్రాఘవరావు, పార్టీ జిల్లా పంచాయతీరాజ్ అధ్యక్షుడు మోరంపూడి రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురం రూరల్‌లో..

పెద్దాపురం: వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. స్థానిక మున్సిపల్ సెంటర్‌లో ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు అధ్యక్షతన జరిగిన సభలో దొరబాబు మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీ విజయం తథ్యమన్నారు. మరో నాలుగు దఫాలు రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తారన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజల జీవితాలకు వెలుగు వచ్చిందన్నారు. ప్రతి కార్యకర్త పార్టీ బలోపేతానికి పాటుపడాలన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, కనకాల మహాలక్ష్మి, అగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు ఆవాల లక్ష్మీనారాయణ, ఆప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు తదితరులు పాల్గొన్నారు. కాండ్రకోటలో జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు పార్టీ జెండాను ఆవిష్కరించారు. సర్పంచ్ శ్రీనివాస్, ఎంపీటీసీ భద్రరావు, ఉప సర్పంచ్ జోకా నానాజీ, సొసైటీ అధ్యక్షులు పల్లా గంగారావు, లక్కాకుల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి ఆల్బెండజోల్..

- నులి పురుగుల నివారణకు తప్పనిసరి
- నియోజకవర్గంలో 40,912 మందికి మాత్రలు



పెద్దాపురంలో పంపిణీకి ఆల్బెండజోల్ మాత్రలను సిబ్బందికి అందజేస్తున్న ఎంపీడీఓ, డీఎంహెచ్ఓ

పెద్దాపురం: ఆరోగ్యంగా ఉంటే జీవితం సాఫీగా సాగుతోంది.. లేకుంటే అన్నీ సమస్యలే వెంటాడతాయి.. చిన్నప్పటి నుంచి చిన్నారుల ఆరోగ్యంపై ప్రభుత్వం శ్రద్ధ తీసుకుంటోంది. ప్రధానంగా వారి కడుపులో పెరిగే నులి పురుగుల సమస్య చిన్నదని వదిలేస్తే చిక్కులు తెచ్చుకున్నట్టే. వీటివల్ల రక్తహీనత సమస్య, ఎదుగుదల లేకపోవడం చిన్నారుల్లో కనిపిస్తుంది. సరిపడా ఆహారం తీసుకున్నా పిల్లలు పేలవంగా కనిపిస్తుంటారు. అందుకు కారణమైన నులి పురుగులను నివారించేందుకు ప్రభుత్వం ఆల్బెండజోల్ మాత్రల పంపిణీని చేపట్టింది. పెద్దాపురం నియోజకవర్గంలోని రెండు అర్బన్‌లతో పాటు, సామర్లకోట మండలం వేట్లపాలెం, పెద్దాపురం మండలం కాండ్రకోట, పులిమేరు, పీహెచ్‌సీల పరిధిలో ఈ కార్యక్రమాన్ని చేపట్టేందుకు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

ఏటా మాదిరిగానే..

ఏటా మార్చి 14న జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో నులి పురుగులపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పిస్తూ ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ చేపడుతున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒకటి నుంచి 19 ఏళ్ల లోపు వారందరికీ ఈ మాత్రల అందజేయనున్నారు. నులి పురుగుల ప్రభావం కారణంగా తలెత్తే రక్తహీనత సమస్య నివారణ లక్ష్యంగా విద్యా శాఖ, మాతా శిశు సంక్షేమ, పంచాయతీ రాజ్, జిల్లా పరిషత్ శాఖల సమన్వయంతో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేయనున్నారు. ఈ మాత్రలను మింగించే బాధ్యతలను ఉపాధ్యాయులు తీసుకోనున్నారు. వీటిని వైద్య సిబ్బంది పర్యవేక్షిస్తారు. నియోజకవర్గంలో ఆయా పీహెచ్‌సీల్లో వైద్యాధికారులు, ఫార్మాసిస్టులు, వైద్య, ఆరోగ్య, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు ఇందులో భాగస్వాములు అవుతున్నారు. మొత్తం 40,912 మంది చిన్నారులకు నులి పురుగు నివారణ మాత్రలను అందించనున్నారు.

వైద్య సిబ్బంది పర్యవేక్షణలో..



విద్యార్థులు ఆల్బెండజోల్ మాత్రలను వైద్య, ఆరోగ్య కార్యకర్తల పర్యవేక్షణలోనే మింగాలి. కడుపులో నులి పురుగులు పెరగడంతో రక్తహీనతకు గురవుతారు. శాస్త్రీయ పద్ధతుల్లో ఆహారం తీసుకున్నప్పటికీ ఒంటికి పట్టదు. కడుపులో పురుగుల సమస్య పరిష్కారానికి తగిన మోతాదులో ఆల్బెండజోల్ మాత్రను విధిగా వేసుకోవాలి.

–ఎస్.సుదీప్తి, పీపీ యూనిట్ వైద్యురాలు, పెద్దాపురం

మోతాదు ఎంత అంటే..

ఆరోగ్య సిబ్బంది ఇచ్చే 400 ఎంజీ ఆల్బెండజోల్ మాత్రను అవగాహనతో వేయాలి. రెండేళ్ల లోపు చిన్నారులకు సగం మాత్రను నీటిలో కరిగించి స్పూన్‌తో వేయాలి. ఆపై బడిన వారికి పూర్తి మాత్రను నమిలి మింగాలి. మాత్ర పరగడపున వేసుకుంటే కడుపులో తిప్పడం, వాంతులు అయ్యే అవకాశం ఉంది. ఆహారం తీసుకున్న తర్వాతే వేసుకోవాలి. ఏదైనా సమస్య తలెత్తితే ఆందోళన చెందకుండా ఆరోగ్య సిబ్బందిని సంప్రదించాలి.

వ్యాపార కార్యకలాపాలకు అనువుగా కాకినాడ

కాకినాడ క్రైం: దిగ్గజ కార్పొరేట్ సంస్థల వ్యాపార కార్యకలాపాలకు కాకినాడ నగరం అత్యంత అనువైందని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అన్నారు. నగరానికి రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు ఉందన్న ఆయన ఇక్కడి ప్రజల కొనుగోలు శక్తి ఆదాయానికి అనుగుణంగా పెరిగిందన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని పేర్రాజుపేటలో కొత్తగా ఏర్పాటైన స్మార్ట్ లేబొరేటరీస్‌ను ద్వారంపూడి ప్రారంభించారు. అనంతరం సంస్థ సీఈఓ కృష్ణచైతన్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. స్మార్ట్ లేబొరేటరీస్‌ను నగరానికి ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. దేశంలో వివిధ రాష్ట్రాల్లో సేవలందిస్తున్న సంస్థ కాకినాడలో తన కార్యకలాపాలు విజయవంతంగా విస్తరించాలని ఆకాంక్షించారు. సంస్థలో స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని యాజమాన్యాన్ని కోరారు. అనంతరం సంస్థ సీఈఓ కృష్ణచైతన్య, చైర్మన్ వెన్నల దీపక్ మాట్లాడుతూ కోవిడ్ పరీక్షల కిట్‌ను మొట్టమొదటి సారి తయారు చేసి దేశానికి అందించిన ప్రతిష్టాత్మక మైల్యాబ్ సంస్థ ఆధ్వర్యంలో స్మార్ట్ లేబొరేటరీస్ పని చేస్తుందన్నారు. జెనెటిక్ డిజార్డర్స్, కేన్సర్, టీబీ, తలసేమియా, ఈక్లియాతో పాటు పలు కీలక పరీక్షలకు తమ ల్యాబ్ దేశంలో ఉత్తమ ల్యాబ్‌గా పేరొందిందన్నారు. కనీసం 4 రోజుల సమయం తీసుకునే పరీక్షలకు కేవలం 24 గంటల్లో తమ ల్యాబ్‌లో పూర్తి చేసి కచ్చితమైన రిపోర్టు ఇస్తామని అన్నారు. అందుకుతగ్గ టెక్నాలజీ, నిపుణులు తమ ల్యాబ్‌లో అందుబాటులో ఉన్నారన్నారు. ఎన్ఏబీఎల్ ప్రమాణాలతో మాలిక్యులర్ బయాలజీ టెక్నాలజీతో రూపుదిద్దుకున్న తమ ల్యాబ్ ద్వారా అత్యంత కచ్చితమైన విలువలతో వైద్య ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నగర మాజీ మేయర్ సుంకర శివప్రసన్నతో పాటు కార్పొరేటర్లు, సంస్థ సౌత్ హెడ్ రంగా, తెలంగాణ మార్కెటింగ్ హెడ్ దయానా తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విజయ సత్తెమ్మ జాతర



సత్య ప్రియ బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన



రమణయ్యపేటలో విజయ సత్తెమ్మ తల్లి

కాకినాడ రూరల్: రమణయ్యపేట గ్రామ ఈశ్వర్‌నగర్‌లో విజయ సత్తెమ్మ వారి ఆలయం వద్ద 22వ జాతర మహోత్సవాలు అట్టహాసంగా జరిగాయి. రెండు రోజుల పాటు నిర్వహించిన ఉత్సవాలు ఆదివారం రాత్రితో ముగిశాయి. అమ్మవారిని ఈశ్వర్‌నగర్ వాసులతో పాటు గ్రామస్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కండవల్లికి చెందిన సత్య ప్రియ బృందం కూచిపూడి నృత్యం అలరించింది. అలాగే సర్పవరంలో ప్రసిద్ధి గాంచిన రాజ్యలక్ష్మీ సమేత భావనారాయణ స్వామివారి ఆలయాన్ని కాకినాడ స్పెషల్ మొబైల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ సి.జానకి, అంజిబాబు దంపతులు దర్శించుకున్నారు. తొలుత వారికి ఆలయ అధికారులు, చైర్మన్ నారాయణరావు స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనాలు అందించారు.

రత్నగిరిపై సూర్యనమస్కారాలు



రత్నగిరిపై సూర్య నమస్కారాలు నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని సన్నిధిలో ఆదివారం సూర్యనమస్కారాలు నిర్వహించారు. రత్నగిరి కళా వేదికపై ఆలయ పండితులు ఉదయం తొమ్మిది గంటలకు సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు చేసి వివిధ భంగిమల్లో సూర్య నమస్కారాలు సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. పండితులు కొంపెల్ల మూర్తి, ఆకొండి కృష్ణశర్మ, రాందాసు, నాగాభట్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ నివారణపై విద్యార్థులకు అవగాహన

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం ఆదిత్య, ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలల్లో చదువుతూ రామేశ్వరంపేటలో హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులకు మత్తు పదార్థాల (డ్రగ్స్) నివారణపై ఆదివారం స్థానిక ఎస్సై వై.గణేష్‌కుమార్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మత్తు పదార్థాల జోలికి వెళ్లరాదన్నారు. సత్ప్రవర్తనతో మెలిగి కన్నవారికి, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఎవరైనా మత్తు పదార్థాలు వాడినా, విక్రయించినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. జగ్గంపేట సీఐ బి.సూర్య అప్పారావు, గండేపల్లి ఎస్సై వై.గణేష్ కుమార్ ఫోన్ నంబర్లతో ఉన్న డ్రగ్స్ రహిత సమాజం అనే పోస్టర్‌ను కళాశాల, హాస్టల్‌లో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ధ్వజస్తంభం పునః ప్రతిష్ఠ పనులు ప్రారంభం



గోకవరం శివాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న పండితులు

గోకవరం: స్థానిక రామలింగేశ్వరస్వామి ఆలయ (శివాలయం) మండపం పునర్నిర్మాణ, ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ పనులు ప్రారంభమయ్యాయి. ఆదివారం వేదపండితులు ప్రత్యేక పూజలు, హోమాలు చేసి పనులను ప్రారంభించారు. ప్రస్తుతం ఉన్న మండపం స్థానంలో కొత్త మండపం ఏర్పాటు చేయడంతో పాటు ధ్వజస్తంభాన్ని సైతం తొలగించి దాని స్థానంలో మరో ధ్వజస్తంభాన్ని పునఃప్రతిష్ఠిస్తున్నారు. సొసైటీ చైర్మన్ గాజింగం సత్తిబాబు, వల్లీదేవి దంపతులు పీటలపై కూర్చొని స్వామివారికి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం శాస్త్రోక్తంగా ధ్వజస్తంభాన్ని తొలగించారు. ఆలయ మండపం పునర్నిర్మాణంతో పాటు ధ్వజస్తంభం పునఃప్రతిష్ఠకు సహకరించే దాతలు ఎవరైనా ఉంటే ఆలయంలో సంప్రదించాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. గ్రామ పెద్దలు దాసరి తమ్మన్నదొర, గాజింగం సత్తిబాబు, దాసరి రమేష్, సుంకర వీరబాబు, దాసరి సతీష్‌బాబు, వరసాల ప్రసాద్, తుమ్మల చిన్నబ్బు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



గాయపడిన గుర్తు తెలియని వ్యక్తి(ఫైల్)

కొత్తపల్లి: గుర్తు తెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఆదివారం పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపల్లి డీసీసీ బ్యాంకు సమీపంలో ఉన్న పాత పోలీసు స్టేషన్ వద్ద ఈ నెల పదో తేదీన సుమారు 50 ఏళ్ల వయసు గల గుర్తు తెలియని వ్యక్తి పడి ఉండడంతో స్థానికులు అతనిని కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆయన చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. దీనిపై ఎస్సై రామలింగేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

వాహనదారులకు భద్రతే లక్ష్యం కావాలి

హైవే ప్రాజెక్టు మేనేజర్ రజనీకాంత్



తేటగుంటలో ఉద్యోగులను మెమెంటోలతో సత్కరిస్తున్న హైవే ప్రాజెక్టు మేనేజర్ రజనీకాంత్

తుని రూరల్: వాహనదారులు, ప్రయాణికులకు భద్రతే లక్ష్యం కావాలని హైవే ప్రాజెక్టు మేనేజర్ రజనీకాంత్ అన్నారు. మండలంలో తేటగుంట హైవే నిర్వహణ యార్డులో దివాన్ చెరువు, అనకాపల్లి టోల్ ప్లాజాల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం 52వ జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రమాదాల నివారణ, రోడ్డు భద్రతపై హైవే ప్రాజెక్టు మేనేజర్ రజనీకాంత్ అవగాహన కల్పించారు. టోల్‌ప్లాజాలు, రోడ్ల నిర్వహణ, హైవే పెట్రోలింగ్, తదితర విభాగాల్లో పని చేస్తూ ప్రతిభ కనబర్చిన ఉద్యోగులను మెమెంటోలతో సత్కరించారు. ఏజీఎం ఎస్.శ్రీనివాస్, హెచ్ఎస్ఈ హెడ్ కె.శ్రీనివాస్, హెచ్ఎస్ఈ మేనేజర్ అశోక్, సేఫ్టీ ఆఫీసర్ అజయ్, తుని రూరల్ ఎస్సై ఎ.బాలాజీ, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ నెహ్రూ, టోల్ ప్లాజా మేనేజర్ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఆచార వ్యవహారాలు అలవర్చుకోవాలి

బోట్‌క్లబ్: ముస్లిం విద్యార్థులు తమ చదువుతో పాటు ఇస్లాం ధర్మం, ఆచార వ్యవహారాలు అలవర్చుకోవాలని రాష్ట్ర వక్ఫ్ బోర్డు డైరెక్టర్ అబ్దుల్ బషీరుద్దీన్ అన్నారు. స్థానిక జేఎన్‌టీయూ వద్ద ఉన్న మేవా ఫంక్షన్ హాల్‌లో దావత్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జల్సా అజ్మితే ఖుర్‌ఆన్ ఇస్తిఖ్బాలే రమజాన్ కార్యక్రమం నిర్వహించారు. ఇస్లాం నియమ నిబంధనలు కూడా విద్యార్థులు తమ పాఠశాల విద్యతో పాటు కొనసాగించాలన్నారు. జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ రెహ్మాన్‌ఖా న్ మాట్లాడుతూ దావత్ చారిటబుల్ ట్రస్ట్ చేస్తున్న సేవలను కొనియాడారు. దావత్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఖురాన్ పఠనం పూర్తి చేసుకున్న 36 మంది విద్యార్థులను ముఖ్య అతిథులు సత్కరించారు. కార్యక్రమంలో మేవా అధ్యక్షుడు ఎండీ జవహర్ అలీ, వక్ఫ్ బోర్డు కార్యదర్శి కరీం బాషా, ట్రస్ట్ కాకినాడ ఇన్‌చార్జి షకీల్ పాషా పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పదవులు పొందిన నేతలకు సత్కారం

జగ్గంపేట: నియోజకవర్గానికి చెందిన ముగ్గురు వైఎస్సార్ సీపీ నాయకులను ఉన్నత పదవులు వరించాయి. జగ్గంపేటకు చెందిన పెద్దాడ రాజబాబు (బేకరిబాబు) వైఎస్సార్ సీపీ సాంస్కృతిక విభాగం కాకినాడ జిల్లా అధ్యక్షుడిగా నియమతులయ్యారు. మండలంలోని గుర్రంపాలేనికి చెందిన సయ్యద్ బాజీ జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్‌గాను, పాస్టర్ నొక్కు విజయరాజు నియోజకవర్గ క్రిస్టియన్ మైనార్టీ కన్వీనర్‌గా నియమితులయ్యారు. వీరిని ఆదివారం జగ్గంపేటలో ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు సత్కరించారు.